ప్రాలేవని, ఆ ఉచ్ఛ్వాస నిశ్వాసలు జనావళి బాధల విముక్తికి బలిగా ఆగిపోవడానికి సిద్ధపడే వని, అయ్యయ్యో! దానికి తెలియదు.

దానికేమీ తెలియదు! బ్రహ్మరాక్షసుడిలా అతని తలను బ్రద్దలు చేస్తూ తీరని రక్తదాహంతో నదిలో వడివడిగా ముందుకు సాగిపోవడంబక్కటే దానికి తెలిసింది... అంతే...

'అమ్మా!' అంటూ జగన్నాథం ప్రాణవాయువులు ఆ గోదావరీ తల్లి ఎదలో లీనమై పోయాయి.

ఏ తల్లి అతన్ని ఇన్నాళ్ళు పెంచి పెద్ద చేసిందో... ఆ తల్లి "అయ్యో! జగన్నాథం నీమీద ఎన్ని ఆశలు పెట్టుకున్నానోయ్" అంటూ భోరున విలపించింది.

ఈ దృశ్యం చూడ లేని బాలచంద్రుడు ఆకసాన అస్తమించిపోయాడు.

ఈ భయానక దృశ్యాన్ని చూసిన మాష్టరు గారి భార్య, "జగన్నాథం... జగన్నాథం... అయ్యో దేవుడివైన నీకే చావు మూడిందా నాయనా అయ్యో..." అంటూ తెలివి తప్పి పడిపోయింది.

అప్పుడే ఈ మహాప్రళయంలోనికి జగన్నాథం ఊహాలకు ప్రాణంగా "కేర్"మని ఒక శిశువు అవతరించింది.

(సమాప్తం)

గల్పిక

# రాద్ధాంతంపై సిద్ధాంతం

నిడదవోలు మాలతి

"ఏం వోయ్ ఈ మధ్య రచయితవై పోయావేం?"

"నేనా?"

"ఊఁ. మంచి రాద్ధాంతం రాశావులే!"

"రాద్ధాంతం? అవును. రాశాను అయితే?"

"అయితే? ఆ కథలో రాముడి బంధువులు మాయింటిదగ్గిరున్నారు."

"అవును తెలుసు."

"వాళ్ళు చదివారు. కోపం వచ్చింది."

"వాళ్ళకా? నీకా?"

"వాళ్ళకే నీను గర్వంట. అందుకే అలా వాళ్ళమీద రాసేవుట."

"నేను వాళ్ళమీద రాయలేదే!"

"అదే లే. వాళ్ళవాళ్ళమీద."

"వాళ్ళవాళ్ళమీద రాయలేదు. పుచ్చకాయలు దొంగలు."

* * *

"మొన్న నీకథ చదివేనోయ్."

"సంతోషమండీ."

"అదేంవిటోయ్. పేర్లేనా మార్చకుండా అలా రాసేశావ్?"

"పేర్లు మారిస్తేమటుకు మీవాళ్ళు గ్రహించలేరా?"

"ఏమైనా పేర్లు మారిస్తేనే బాగుండేది... నేను నిన్నేం అనడంలేదు. కథలు రాయడం మంచిదే. లేకపోతే ఇలాటి అన్యాయాలు అందరికీ ఎలా తెలుస్తాయ్? నేనన్నది మార్పుమాట."

"అవునండి. ఎప్పటికయ్యది ప్రస్తుతమో అప్పటికామాట ఆడమన్నాడు కదా కవి."

"అబ్బే. నిన్ను నేనేం అనడంలేదోయ్."

* * *

ఇంట్లోవాళ్లూనన్నే అంటూన్నారు పైవాళ్లూ నన్నే అంటున్నారు. అంతా నాడే తప్పంటారు. అదేదో కథ జ్ఞాపకం వస్తోంది. నిద్రపోతున్న రచయిత్రికి కథానాయకుడు సాక్షాత్కరించి రచయిత్రిని నిందించాడట, తనకే అన్నికష్టాలు పెట్టినందుకు. పైగా తనకి ముగ్గురాడపిల్లలైతే ఆరుగురని రాసి రచయిత్రి అసత్యప్రచారనేరం చేసిందని. అలాగఉంది. అసలువాళ్ళు ఏంచీ అనలేదు. మధ్య వాళ్ళకెందుకుబాధ? అసలు హెడ్డింగుపైన ఎడం చేతి వేపుమూల మూడక్షరాలలో ప్రకటించబడిన "గల్పిక" కనిపించలేదు. ముక్కోటి ఆంధ్రులలో ఏ ఒక్కడికీ పోలికలేకుండా రాయడం కష్టమే. అందుకే ఒక సిద్ధాంతం చేసుకున్నా, "ఇహమీద ఏదీ సూటిగా తేల్చక, ముంచక, మధ్యస్థంగా రాయాలి." అని! ★